రాగం: మోహన

తాళం: ఆది

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా మమ్ము
నెడయకవయ్య కోనేటిరాయడా

1. కోరి మమ్ము నేలినట్టి కులదైవమా చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువ జిత్తములోని శ్రీనివాసుడా

2. భావింప గైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ
కామించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా

3. చెడనీక బ్రతికించే సిద్ధ మంత్రమా, రోగా
లడచి రక్షించే దివ్యౌషధమా
బడిబాయక తిరిగే ప్రాణబంధుడ, మమ్ము
గడియించినట్టి శ్రీవేంకటనాధుడా